క్లుప్తంగా

అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

వేంసూరు: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని కుంచపర్తి శివాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, సీడీసీ డైరెక్టర్ శంకర్ రెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, వెంకటకృష్ణరెడ్డి, శ్రీనివాసరావు, రత్నకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయన్న మృతికి సండ్ర సంతాపం

సత్తుపల్లి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సాయన్న మరణించటం పట్ల సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సంతాపం వ్యక్తం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, పలు పదవులు ద్వారా సాయన్న చేసిన ప్రజా సేవలను, తనతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్మరించుకున్నారు. సాయన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండలంలో మదన్‌లాల్ పర్యటన

కారేపల్లి: మండలంలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పర్యటించారు. మాణిక్యారం, గుడితండా, భాగ్యనగర్‌తండా, కొత్తూరుతండా గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు జగన్‌నాయక్, నాయకులు రమేష్, కోటేశ్వరరావు, గౌసుద్దీన్, రాజేష్ నాయక్, చందూనాయక్, పవన్, రవి, కోటి, రమేష్, వికాస్, ఖలీలుల్లాఖాన్, రాంబాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడి తొలగింపు

కారేపల్లి: సింగరేణి మండల బీఆర్ఎస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు రమేష్‌ని పదవి నుంచి తొలగిస్తు.. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీసెల్ అధ్యక్షుడు పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకపోవటం, పార్టీ బలోపేతానికి కృషి చేయక పోవటంతో పదవి నుంచి తప్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

దిరిశాల భద్రయ్య సేవలు మరువలేనివి

తల్లాడ: సీనియర్ కాంగ్రెస్ నాయకులు దిరిశాల భద్రయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి భద్రయ్య నాలుగో వర్ధంతిని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రయ్య, గ్రామానికి చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో గోపయ్య, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్లు, మదనయ్య, శేషయ్య, సందీపులు, రాఘవ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు లక్ష్మారెడ్డి మృతి

చింతకాని: మండలంలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు అవులూరి లక్ష్మారెడ్డి (52) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీంద్రబాబు, మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, జానికిరాములు, సీతారామిరెడ్డి, రామిరెడ్డి, బక్కిరెడ్డి, గ్రామసర్పంచ్ వేమిరెడ్డి తిరుపతమ్మ సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

నందమూరి తారకరత్నకు నివాళి



హైద్రాబాద్‌లోని భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

సత్తుపల్లి/పెనుబల్లి: సినీనటుడు నందమూరి తారకరత్న ఆకాల మరణం పట్ల సత్తుపల్లి టీడీపీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోట్రు రామారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, సరస్వతి, చందు పాల్గొన్నారు. అదేవిధంగా పెనుబల్లి మండలంలోని లంకపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ నున్నా రామకృష్ణ ఆదివారం హైద్రాబాద్‌లోని తారకరత్న నివాసంలో భౌతికాయాన్ని సందర్శించిన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పదవులకు వేళాయె..!

- ఆత్మకమిటీ చైర్మన్‌గా వనమా వాసు
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై రాని స్పష్టత
- పార్టీలో కీలకం కానున్న జోనల్ కమిటీలు



సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సత్తుపల్లి: అధికార బీఆర్ఎస్ పార్టీలో పదవుల పంపకాలకు ముహూర్తం ఖరారైంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సామాజిక సమీకరణలను బట్టి పదవులను ఎంపిక చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మినహా సత్తుపల్లి మార్కెట్ కమిటీ, ఆత్మకమిటీ పాలకవర్గాలను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేసి సామాజికవర్గాల వారీగా పదవులను కేటాయించుకొని అభివృద్ధి, సంక్షేమ పనులను విస్తృతంగా ప్రచారం చేసేందుకు వ్యూహ ప్రతివ్యూహాలకు ఇప్పటి నుంచే కసరత్తు చేయటం చర్చానీయాంశంగా మారింది.

'ఆత్మ'వనమా వాసుకు..

సత్తుపల్లి డివిజన్ ఆత్మకమిటీ చైర్మన్‌గా వనమా వాసును ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి ప్రకటించటమే తరువాయి అన్నట్లుగా ఉంది. ఆర్యవైశ్య సామాజికవర్గంలో చురుగ్గా పని చేస్తున్న వనమా వాసు సతీమణి ఉమాదేవికి గతేడాది వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని ఇచ్చేందుకు ఎంపిక చేశారు. జనరల్ మహిళా రిజర్వ్ అయిన చైర్మన్ పదవి రొటేషన్ ప్రకారం రిజర్వేషన్ ఎస్సీ జనరల్ కావటంతో ఆ ఎంపిక అర్థాంతరంగా నిలిచిపోయింది. దీంతో అప్పటి నుంచి వనమా వాసుకు తగిన రాజకీయ ప్రాధాన్యతగల పదవిని ఇవ్వాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు అత్యంత ఆత్మీయుడైన ప్రస్తుత ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి పార్టీలో వ్యూహకర్తగా పేరుంది. ఆత్మకమిటీ చైర్మన్ పదవి కాలం పూర్తి అయిన తర్వాత పార్టీలో ఇతరులకు పదవి ఇస్తే పార్టీకి మేలు జరుగుతుందని ఆలోచనతో వనమా వాసుకు ఆత్మకమిటీ చైర్మన్‌గా ఎంపిక చేశారు.

ముడిపడని మార్కెట్ చైర్మన్..

సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్క ఏడాది తప్పా మిగిలిన కాలం అంతా ఖాళీగా ఉంది. సత్తుపల్లి, వేంసూరు మండలాలకు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత గల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కావటంతో ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనరల్ మహిళగా ఉన్నప్పుడు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు మల్లిరెడ్డి మురళీరెడ్డి సతీమణి కిరణ్మయిని హడావుడిగా ప్రకటించారు. ఏడాది తర్వాత రెన్యూవల్ చేయకపోవటంతో పదవి కాలం ముగిసింది. అప్పటి నుంచి ఆశా వాహుల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అందినట్టే అంది చేజారుతుంది. ఎస్సీ జనరల్ కావటంతో ఆ సామాజిక వర్గానికి చెందిన సత్తుపల్లి నుంచి రిటైర్డ్ ఉద్యోగి అద్దంకి వెంకటరత్నం చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. వేంసూరు ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత కూడా ఎస్సీ సామాజిక వర్గం కావటంతో చైర్మన్ పదవి ఎంపిక క్లిష్టంగా మారింది. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఇంకా స్పష్టత వచ్చినట్లు లేదు.

జోనల్ వ్యవస్థ పటిష్టం..

వచ్చే అసెంబ్లీ ఎన్నికలు అత్యంత కీలకం కావటంతో పార్టీ పదవుల భర్తీ ప్రక్రియను చేపట్టారు. పల్లా రాజేశ్వరరెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జోనల్ ఇన్‌చార్జ్‌లుగా పని విభజన చేసి విజయం సాధించినట్లే.. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ జోనల్ ఇన్‌చార్జ్ వ్యవస్థను పటిష్టం చేయాలని పార్టీ అంతర్గత సమావేశాలలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నిర్ణయించినట్లు తెలిసింది. రాజకీయంగా జరుగుతున్న పరిణామాలను కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు సత్వరం తెలుసుకునేలా ఎక్కడికక్కడ ఇన్‌చార్జ్‌లను పెట్టి సమాచారాన్ని క్రోడీకరించి వ్యూహాలను సిద్ధం చేయాలని నిర్ణయించారు. అధికార పార్టీ నుంచి ఎవరైనా వలసలు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారా..? అటువంటి జాబితాలను గ్రామాలు, వార్డుల వారీగా సేకరించి ఖచ్చితమైన సమాచారాన్ని ఉంచుకోవాలని నిర్దేశించారు.

ఎడ్ల పందేలు ప్రారంభించిన జెడ్పీ చైర్మన్



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్

మధిర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని మృత్యుంజయ స్వామి ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న ఎడ్ల పందేలను జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏడాది ఈ పందేలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లు తొలగించాలి



విద్యుత్ తీగలపై వేసిన వైర్లు



యడ్లబంజర్‌లో రాతోని ఎత్తిపోతల లిఫ్టుకు అమర్చిన భారీ విద్యుత్ మోటారు పైపు

పెనుబల్లి: మండలంలోని యడ్లబంజర్‌లో రైతులు అక్రమ విద్యుత్ కనెక్షన్లు వాడడంతో రాత్రి వేళల్లో విద్యుత్ సమస్య ఏర్పడి కరెంట్ లేకుండా పోతుందని యడ్లబంజర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుబల్లి రాతోని ఎత్తిపోతల పథకానికి వచ్చే నీటిని సంపు నుంచి యడ్లబంజర్ రైతులు అక్రమంగా తరలించుకోవడానికి సంపు భావి వద్ద భారీ మోటార్లను ఏర్పాటు చేసి, ఆ మోటార్లకు అక్రమ మోటారు కనెక్షన్లు వాడుతున్నారు. అదే పీడరు మీద ఉన్న యడ్లబంజర్ గ్రామంలోకి తాగునీటి మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి విద్యుత్ లైను ట్రిప్ అవుతున్నాయి. దీంతో గ్రామంలోని తాగునీటి మోటార్లు పనిచేయక, గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కావున విద్యుత్ అధికారులు కల్పించుకొని రాతోని లిఫ్ట నీటికి అమర్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోమయ్యకు సన్మానం

సత్తుపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు బత్తుల సోమయ్యగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూగౌడ్‌లను ఆదివారం సత్తుపల్లి జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణవరపు శ్రీనివాసరావు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రమోద్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు దుస్సా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం

తల్లాడ: తల్లాడలో వేంచేసి ఉన్న హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం 20వ వార్షికోత్సవం నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం విశ్వక్సేనారాధనం, పుణ్యాహావచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, హారతితో ప్రారంభమై కల్యాణం, గోవింద్ పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దివి సీతారామాచార్యులు తెలిపారు.

పాస్టర్లు ఐక్యంగా ఉండాలి



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పాస్టర్లు ఐక్యతతో సేవ చేయాలని హోప్‌మినిస్ట్రీస్ డైరెక్టర్ శామ్యూల్ జాషువా గెడ్డం అన్నారు. ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అధ్యక్షతన పట్టణంలోని ఎన్టీఆర్ ప్రార్థనా మందిరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు బోధనలను అనుసరిస్తూ లోకానికి వివరించాలన్నారు. అనంతరం 200 మంది సువార్తికులకు రూ.లక్ష విలువైన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంగసాని శ్రీనివాస్, ప్రేయర్ వింగ్ జిల్లా అధ్యక్షుడు గుర్రాల సత్యానందం, పాల్ రాజ్, మేషక్, ప్రకాశరావు, శ్రీనివాసరావు, వరప్రసాద్, జోసెఫ్, డేవిడ్‌రాజు, వినోద్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



చింతకాని: శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ యువమోర్చా నాయకులు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో ఆదివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు కొండా గోపి మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శులు అమరనేని విజయ్, సత్తెనపల్లి గోపి, ఉపాధ్యక్షులు బక్క సత్యమూర్తి, శ్రీను, నాయకులు కందిమల్ల నాగేశ్వరరావు, రామారావు, ఉపేందర్, శివ, మహేష్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల కేంద్రంలో బీజేపీ అధ్వర్యంలో ఛత్రపతి శివాజి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్‌లో ఛత్రిపతి శివాజి చిత్రపటం ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లమోతుల రమేష్, మోరబోయిన కృష్ణ, రెంటపల్లి నారాయణ, వేల్పుల బిక్షం, తోట అప్పారావు, దర్గయ్య, శ్రీనివాస్, కన్నయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్ 2పై శిక్షణ

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో సోమవారం నుంచి బుధవారం వరకు స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్ 2పై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ రవీంద్రరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులను మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహిస్తారని తెలిపారు.

మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కిరణ్

సత్తుపల్లిరూరల్: ఈ నెల 20న సత్తుపల్లిలోని జే కన్వెన్షన్‌లో జరిగే టీయూడబ్ల్యూజే డివిజన్ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి టి.కిరణ్ కోరారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే, టీజేఎఫ్ పోరాడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో వి.రామారావు, జె.రాజేష్‌రెడ్డి, బి.సురేష్, ఎస్.మోహన్, రమేష్, ఆనంద్, శ్రీను, ఎ.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..



ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఓ పెద్ద వృక్షం ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు పక్కనే ఉన్న ఈ వృక్షం దానికి ఓ దాబా బోర్డు అడ్డుగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఖమ్మం - కోదాడ ప్రధాన రహదారిలో భారీవాహనాలు, బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ క్రమంగా ఈ వృక్షం ఎప్పుడు కూలి ఎవరిమీద పడుతుందోనని ప్రయాణికులు భయబ్రాంతులకు గురైతున్నారు. కావున ఎటువంటి ప్రమాదం జరగకముందే ఈ వృక్షం కొమ్మలను తొలగించి సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : ప్రదీప్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ జేఈ, ముదిగొండ
సెల్ నంబర్ : 7602823440

వైభవంగా శివపార్వతుల కల్యాణం



వైరారూరల్: పూజలు నిర్వహిస్తున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు



తల్లాడ: శివపార్వతుల కల్యాణంలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు



పెనుబల్లి: నీలాద్రీశ్వరుని కల్యాణంలో పాల్గొన్న డీజీపీ వెంకటేష్ దంపతులు

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు పీటల మీద కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ శివపార్వతులకు కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన జాతర..

రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి జన జాతర వేడుకలు రెండో రోజు కొనసాగాయి. వైరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, ఈఓ శ్రీనివాస్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వర స్వామి దేవాలయంలో..

తల్లాడ: స్థానిక రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రాత్రి ఆలయ అర్చకులు నుదురుపాటి ప్రసాద్ శర్మ, తనుగుల మణికంఠశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వాస్తవ్యులు బాలక్రిష్ణ స్వామివారికి కల్యాణ మండపం చేయించి అందజేశారు. తల్లాడకు చెందిన కొక్కొండ వాసు స్వామివారికి వెండి నామాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కట్టుభోగలింగేశ్వర స్వామి దేవాలయంలో..

కొణిజర్ల: మండలంలోని పలు శివాలయాల్లో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కొణిజర్లలోని కట్టుభోగలింగేశ్వర స్వామి దేవాలయం, పల్లిపాడు శంభులింగేశ్వరస్వామి దేవాలయం, తనికెళ్ల చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయం, రెడ్డిగూడెం రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అర్ధరాత్రి వేదపండితుల కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ వేడుకకు ఆయా గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. కొణిజర్ల, రెడ్డిగూడెంలో భక్తులకు ఆలయకమిటీ వారు అన్నదానం నిర్వహించారు.

ఏన్కూరు శివాలయాల్లో..

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం, ఏన్కూరు శివాలయాల్లో శనివారం రాత్రి శివరాత్రి సందర్భంగా శివపార్వతులు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ భక్తులు కోలాట నృత్యం చేస్తు పాటలు పాడారు. రాత్రి నుంచి ఉదయం వరకు గుడిలోనే ఉపవాస దీక్షలు చేస్తు జాగారం చేశారు.

ఘనంగా నీలాద్రీశ్వరుని కల్యాణం..


పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరుని కల్యాణం శనివారం రాత్రి మేళతాళాలతో భక్తుల కనులవిందుగా నిర్వహించారు. పాల్వంచ డీజీపీ ఎస్.వెంకటేష్ దంపతులు, సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్ దంపతులతో పాటు పలువురు స్వామి కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. అర్చకుల వేద మంత్రాలతో లోక కల్యాణం కోసం నీలాద్రీశ్వరుని కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కొనసాగుతున్న మల్లిఖార్జునస్వామి జాతర..

ముదిగొండ: మండలంలోని వల్లాపురం సమీపంలోని శ్రీమల్లిఖార్జునస్వామి జాతర రెండోరోజు ఆదివారం కొనసాగింది. ముదిగొండ, చింతకాని మండలాలకు చెందిన మున్నేరులో స్నానమాచరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.



వైరారూరల్: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ఏన్కూరులో..



కొణిజర్ల: కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కొణిజర్ల: కొణిజర్ల మండల కేంద్రంలోని పాతబజార్‌లో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణులు, స్థానికులు పూజలు నిర్వహించి కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ కల్యాణానికి సర్పంచ్ సూరంపల్లి రామారావు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమాణికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పెద్దలు నెమలికొండ పుల్లయ్యాచారి, రామకృష్ణాచారి, వెంకటేష్, వీరాచారి, పి.శ్రీనివాసచారి, అనంతోజు పుల్లయ్యాచారి, సైదాచారి, వెంకటరత్నాచారి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.